క్లుప్తంగా

పిల్లలకు నీతి కథల బోధన



గ్రంథాలయంలో నీతి కథలను ఆసక్తిగా వింటున్న విద్యార్థులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం దసరా సెలవుల తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా తరగతులకు హాజరైన విద్యార్థులకు నీతి కథలు బోధించారు. మిఠాయిలు పంచిపెట్టారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనానికి పాదయాత్ర

ఎస్.రాయవరం: పాదయాత్రతో దుర్గమ్మకొండకు వెళ్తే కలిగే అనుభూతే వేరని వమ్మవరం సర్పంచ్ పాలవర్తి పాపారావు అన్నారు. గ్రామం నుంచి ముగ్గురు మాలధారణ భక్తులు ఆదివారం విజయవాడ దుర్గమ్మ కొండకు పాదయాత్రగా బయలుదేరారు. వీరికి అడ్డురోడ్డులో స్వాగతం పలికి పండ్లు అందించారు. వమ్మవరం శ్రీ వేంకటేశ్వరస్వామి పీఠం వద్ద మాలధారణలో ఉన్న పల్లేల వరహాలు, మండాల స్వామి, బొలిశెట్టి వాసులు విజయవాడ కొండకు పయనమయ్యారు. వీరిని మాజీ జెడ్పీటీసీ కొంకోట నీలేంద్రరావు, సర్పంచ్ పాపారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొంతిన సత్యనారాయణ తదితరులు అడ్డురోడ్డులో స్వాగతం పలికి అభినందించారు.

ఘనంగా భగీరథమ్మ ఉత్సవాలు



భగీరథమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

అచ్యుతాపురం(అనకాపల్లి): జిల్లాలో పేరొందిన భగీరథమ్మ దసరా నవరాత్రి మహోత్సవాలు ఆదివారం హరిపాలెం–అందలాపల్లి కొండపై ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయంలో భీమిశెట్టి గణపతి ఆదినారాయణ, జగదీశ్వరి దంపతులు, మొల్లేటి త్రినాథ్, కుసుమ దంపతుల చేతుల మీదుగా కలశ స్థాపన, గణపతి పూజ నిర్వహించారు. కార్యక్రమాల్లో బుద్ద వెంకట సత్యరామ్, కాండ్రేగుల అప్పారావు, సూరిశెట్టి గాంధీ, కోట్ని శివ, బుద్ద నాగేశ్, సూరి అప్పారావు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

జన సైనికులకు సభ్యత్వ కిట్‌ల పంపిణీ

మునగపాక : జనసేన, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని జనసేన నియోజకవర్గ కన్వీనర్ సుందరపు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం మునగపాక పార్టీ కార్యాలయంలో జన సైనికులకు ఆయన కిట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా శ్రమించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి టెక్కలి పరశురామ్, మండల ఇన్‌చార్జి శ్రీనివాసరావు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఎస్.రాయవరం: రేవుపోలవరం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్న తరుణంలో గ్రామానికి చెందిన ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖకు చెందిన మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్య బృందం 120 మంది మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. 220 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో లక్ష్మీగాయత్రీ వైద్య సిబ్బంది సాధారణ రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహించగా, హైమా కంటి ఆస్పత్రి వైద్యులు కంటి రోగాలకు చికిత్స అందించారు. ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బంగారు చిట్టి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు చోడిపల్లి గోవిందు, గనగళ్ల రాజేష్ సహాయ సహకారాలు అందించారు.



స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవీ నమోస్తుతే

- వైభవంగా మొదలైన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- ఊరూవాడా అమ్మవారి ఆలయాల్లో భక్తుల కిటకిట

మహిషాసురుడ్ని సంహరించేందుకు అమ్మవారు ఒక్కో రోజు ఒక్కో అవతారంగా తొమ్మిది అవతారాలు ధరించారని పురాణ ప్రతీతి. ప్రతీ సంవత్సరం ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి మొదలు నవమి వరకు దేవీ శరన్నవరాత్రులు ఊరూవాడా ఘనంగా నిర్వహిస్తారు. దుర్గాదేవిని వివిధ రూపాలలో అలంకరించి షోడశోపచారాలతో కొలుస్తారు. నవరాత్రులలో తొలిరోజైన ఆదివారం ఊరూవాడా పలు దేవాలయాల్లో అమ్మవారిని స్వర్ణకవచధారిణిగా, గాయత్రీమాతగా, బాలాత్రిపుర సుందరిగా, లక్ష్మీదేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు.

యలమంచిలి(అనకాపల్లి రూరల్): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని పలు ప్రాంతాలు, మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువు దీరిన అమ్మవారిని భక్తులు ఉదయం నుంచే దర్శించుకున్నారు. పూజలు చేశారు. పట్టణంలో సతకంపట్టు, రాంనగర్, ధర్మవరం, కొక్కిరాపల్లి రైల్వే గేటు, సోమలింగపాలెం, తెరువుపల్లి, పులపర్తి, రేగుపాలెం, పీఎస్‌ఆర్ పేట, ఏటికొప్పాక, జంపపాలెం, పెదపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో, ప్రత్యేక మండపాల్లో దుర్గమ్మ విగ్రహాలకు ఘనంగా పూజలు జరిపారు. కొన్ని చోట్ల వివిధ ఆకారాల్లో నిర్మించిన మండపాలు, అమ్మవారి విగ్రహాలు, విద్యుత్ అలంకరణల నడుమ చూపరులను కనువిందు చేశాయి. గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి.

లక్ష్మీదేవిగా కన్యకాపరమేశ్వరి

పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేకువ జామునే పలువురు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించారు. అనంతరం గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో గాయత్రీ హోమం చేశారు. సాయంత్రం లాటరీ ద్వారా ఎంపిక చేసిన 9 మంది అవివాహిత యువతుల చేతులమీదుగా అమ్మవారికి ప్రత్యేక హారతి ఇచ్చారు. రాత్రికి అమ్మవారి వాహన సేవ జరిపారు. పలువురు ఆర్యవైశ్యులు అమ్మవారి దర్శనానికి తరలి వచ్చారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు సేతి సురేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



యలమంచిలి పట్టణంలోని సతకంపట్టు వద్ద పూజలందుకుంటున్న దుర్గమ్మ

కోటవురట్ల: మండలంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలు గ్రామాలలో భారీ ఊరేగింపుగా అమ్మవారి విగ్రహాలను తీసుకెళ్లి, భక్తి శ్రద్ధలతో మండపాలలో నెలకొల్పారు. లింగాపురం గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు, భవానీ మాలధారులు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఆలయాలు భక్తుల పూజలతో కళకళలాడాయి.

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దిమిలిలో సంతబయలు, గ్రంథాలయం వద్ద, నగ్నేశ్వరస్వామి ఆలయం, వల్లభనారాయణస్వామి ఆలయాల్లో అమ్మవార్లను ప్రతిష్ఠించారు. నారాయణపురం, మామిడివాడ, కొత్తూరు, రాంబిల్లి, లాలంకోడూరు, పంచదార్ల, మురకాడ, రాజానాయుడుపాలెం, మర్రిపాలెం తదితర గ్రామాల్లో పలువురు భవానీ మాల ధారణ చేసి భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు జరిపారు.

పాయకరావుపేట: విజయదశమి సందర్భంగా గ్రామాల్లోని మండపాల్లో ఏర్పాటు చేసేందుకు భక్తులు అమ్మవారి భారీ విగ్రహాలను వాహనాలపై తరలించారు. పట్టణంలోని బృందావనం, దుర్గానగర్, బైపాస్ నందు గల అమ్మవారి ఆలయాలు, అరట్లకోట, మంగవరం, రాజగోపాలపురం తదితర గ్రామాల్లో మండపాల్లో భక్తులు అమ్మవారిని నెలకొల్పి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు భవానీ మాలధారణతో దీక్షలు ప్రారంభించారు. మండపాల్లోను మహిళలు కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు.



లింగాపురంలో బోనాలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు, భవానీ మాలధారణ భక్తులు


యలమంచిలి: దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని అన్ని వార్డుల్లో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిలట్రీ కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు పిళ్లా త్రినాథ్, సుందరపు బాల్జీ ఆధ్వర్యంలో దుర్గాదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు జరిపారు. ఏఎస్‌ఆర్ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, తులసీనగర్‌లో పాత వీధి, యలమంచిలి పాత జాతీయ రహదారిపై చలువ పందిళ్లు వేసి, అమ్మవారి విగ్రహాలను నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారి మాల ధరించి, పసుపు కుంకుమలతో పూజలు చేశారు.

➡ మండలంలో ఏటికొప్పాక గ్రామంలో భారీ దుర్గాదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. యలమంచిలి జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి, రాము దంపతులు, వైఎస్సార్‌సీపీ నేతలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యలమంచిలి పట్టణంలో కనకమహాలక్ష్మి ఆలయం, పెంజెరువు దుర్గాదేవి ఆలయాల్లో మహిళలు భారీ సంఖ్యలో వెళ్లి, అమ్మవారికి విశేష పూజలు జరిపారు. కార్యక్రమాల్లో ఏటికొప్పాక ఎంపీటీసీ నగిరెడ్డి అచ్చినాయుడు, కరణం రవి, నాసేపల్లి వెంకినాయుడు, కాండ్రకోట చిరంజీవి, వీసం ప్రసాద్, అన్నం బుజ్జి, జామి వెంకటరమణ, ఇనరపు శ్రీను, గొంతి మూర్తి, బండిమాంబ యూత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: శరన్నవరాత్రుల్లో భాగంగా ఎస్.రాయవరంలో భవానీ మాలధారణ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రతిమను ఊరేగింపుగా తీసుకువచ్చి, దుర్గమ్మ సన్నిధిలో నిలిపారు. ఈ క్రమంలో గ్రామంలో భారీ సందడి నెలకొంది. గోకులపాడు, కొరుప్రోలు, అడ్డురోడ్డు తిమ్మాపురం, కోనవానిపాలెం, రామయ్యపట్నం, దార్లపూడి, పి.ధర్మవరం తదితర గ్రామాల్లో దుర్గమ్మ విగ్రహాలను మండపాల్లో ఏర్పాటు చేసి, పూజలు జరిపారు.

మునగపాక: మండల వ్యాప్తంగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. హరిపాలెంలోని భగీరథమ్మ ఆలయం వద్ద పలువురు భక్తులు మాలలు ధరించారు. స్థానికంగా ఉన్న ఆలయాల్లో కూడా జై దుర్గా.. జైజై దుర్గా నామస్మరణతో అమ్మవారి విగ్రహాలను ఊరేగించి మండపాల్లో నెలకొల్పారు. మునగపాకలో అమ్మవారిని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ దర్శించుకుని పూజలు చేశారు. ఎంపీటీసీ సూరిశెట్టి రాము, అంబేడ్కరిజం పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు. మునగపాక పంచాయతీ వీధిలోని భీమేశ్వరస్వామి ఆలయ పురోహితులు కోటేశ్వరశర్మకు డాన్ జీమ్ అధినేతలు పెంటకోట విజయ్ తల్లి నాగమణి జ్ఞాపకార్థం పంచలోహ విగ్రహాన్ని అందించారు.

నక్కపల్లి: పల్లెల్లో దేవీనవరాత్రులు ఆదివారంనుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. నక్కపల్లి, దేవవరం ఉద్దండపురం, చినదొడ్డిగల్లు, గొడిచర్ల, కాగిత, చందనాడ, వేంపాడు, రాజయ్యపేట, సీహెచ్‌ఎల్ పురం, రేబాక, రమణయ్యపేట, గుల్లిపాడు, సీతంపాలెం, చినతీనార్ల, డీఎల్ పురం, గునిపూడి, బంగారయ్యపేట తదితర గ్రామాల్లో ఆదివారం ఉత్సవాలను అత్యంత అట్టహాసంగా ప్రారంభించారు. మండపాల వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల వద్ద ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. గణపతి పూజ, కలశస్థాపన, మండపారాధన, దుర్గా అష్టోత్తర పూజలు నిర్వహించారు. రాత్రి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా భజనలు నిర్వహించారు. ముందుగా అమ్మవారి ప్రతిమలను భారీ బాణాసంచా, డప్పు వాయిద్యాల మధ్య మండపాల వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. కాగిత, సారిపల్లిపాలెం, మనబానవానిపాలెం గ్రామాల్లో ఉన్న దుర్గాదేవి ఆలయాల వద్ద బోనాల ఊరేగింపు జరిగింది. భవానీ భక్తులు శరణు ఘోష చెబుతూ అమ్మవారి చిత్రపటాలను, బోనాలను ఊరేగించారు. వేకువ జాము నుంచే అమ్మవారిని దర్శించుకుని, భక్తులు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.



దిమిలి రోడ్డు వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో..



దిమిలి సంతబయలు వద్ద భక్తులకు దర్శనమిచ్చిన దివ్యదుర్గ అమ్మవారు



మునగపాకలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



దేవవరంలో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారికి పూజలు



అమ్మవారి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై తరలిస్తున్న భక్తులు



శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి పూజలు



మునగపాకలో దుర్గమ్మ పంచలోహ విగ్రహాన్ని అందిస్తున్న డాన్ జీమ్ అధినేత విజయ్ దంపతులు



ఏటికొప్పాకలో దుర్గాదేవి పూజలో పాల్గొన్న జెడ్పీటీసీ దంపతులు, భక్తులు



యలమంచిలి పట్టణం మిలట్రీ కాలనీలో అమ్మవారికి మహిళల పూజలు



ఎస్.రాయవరంలో ఊరేగింపుగా తీసుకొస్తున్న అమ్మవారి విగ్రహం

గ్రామాల అభివృద్ధికి లారస్ సేవలు భేష్



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, లారస్ సీఈవో సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

- ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు
- నందడిగా మునగపాక మార్కెట్ యార్డు ప్రారంభం
- ఆకట్టుకున్న కోలాటం, చిటికల భజనలు

మునగపాక : మండల కేంద్రమైన మునగపాకలోని సంతబయలు మార్కెట్‌యార్డు ప్రారంభోత్సవం పండుగ వాతావరణంలో జరిగింది. యార్డులో లారస్ ల్యాబ్స్ సౌజన్యంతో రూ.30లక్షలు నిధులు మంజూరు చేసి షెడ్లు నిర్మించారు. ఆ సంస్థ సీఈవో డాక్టర్ దావా సత్యనారాయణ, ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ సంయుక్తంగా మార్కెట్‌యార్డు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమణమూర్తిరాజు మాట్లాడుతూ సామాజిక అభివృద్ధి పనులకు లారస్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. లారస్ సీఈవో సత్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు లారస్ ద్వారా సహకారాన్ని అందించామన్నారు. ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సభాధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ మునగపాకతో పాటు పరిసర గ్రామాల వారికి అనువుగా ఉండేలా మార్కెట్‌యార్డు నిర్మించారన్నారు. ఇందుకు సహకరించిన ల్యారస్ సీఈవోకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మునగపాకలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రొంగలి జగన్నాథం, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, లారస్ ల్యాబ్స్ వైస్ ప్రెసిడెంట్ దావా నరసింహరావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ దావా సౌమ్య, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ జయలక్ష్మి , జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిళ్లి కనకలక్ష్మి అప్పారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పలనాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ గణేష్, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డేడ నరసింహరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం, చిటికల భజనలు అందరినీ ఆకట్టుకున్నాయి.



ఆకట్టుకున్న కోలాటం, మహిళల చిటికల భజన

అబ్దుల్ కలాం ఆశయ సాధనకు పాటుపడాలి

మునగపాక : ప్రతి ఒక్కరూ భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం ఆశయ సాధనకు పాటు పడాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మునగపాకలోని బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో ఆదివారం భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ అబ్దుల్‌కలాం హయాంలో భారతదేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, మద్దాల పీరునాయుడు, మూలపేట ఉపసర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర, వైఎస్సార్‌సీపీ నేతలు అల్లవరపు రమణబాబు, ముత్యాల భాస్కరరావు, కొరుప్రోలు చిన్నారావు, శ్రీనివాసరావు, చదరం అప్పలనాయుడు కార్యక్రమంలో పాల్గొన్నారు.



కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

లాస్విక ఆర్యకు అభినందన సత్కారం

తుమ్మపాల : పుట్టిన ఏడాదిలోనే అంతర్జాతీయ స్థాయిలో రికార్డులు సాధించిన మంత్రి లాస్విక ఆర్యను శ్రీ చింతామణి గణపతి దత్త క్షేత్ర సభ్యులు ఎం.అంజనేయరాజు, సీనియర్ ట్రస్టీ మూర్తి ఆలయంలో ఆదివారం సత్కరించారు. జీవీఎంసీ విలీన గ్రామం సిరసపల్లిలోని ఆలయంలో శ్రీచింతామణి గణపతి వద్ద లాస్విక పొందిన ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్, వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్, ఇండియన్ స్టార్ బుక్ ఆఫ్ రికార్డ్, ఛాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సంస్థల ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. గణపతి సచ్చిదానంద స్వామీజీ వస్త్రంతో పాటు చిత్రపటాన్ని, జ్ఞాపికను అందించి తల్లిదండ్రులను సత్కరించారు. లాస్విక ఆర్య మరిన్ని విజయాలు సాధించాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ట్రస్టీ సభ్యులు సీపీ రామారావు, ఇంద్రలక్ష్మి, ఎం.రుషికేష్, సోమయాజులు, ఎ.పద్మావతి, రవిచంద్ర పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష నేడు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని దిబ్బపాలెం సచివాలయం–1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఈ నెల 16న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఆదివారం విజయలక్ష్మి తెలిపారు. స్పెషలిస్టు వైద్యులతో వివిధ రకాల రక్తపరీక్షలు, ఈసీజీ, బీపీ, సుగర్ పరీక్షలు జరిపి, అవసరమైన మందులు ఉచితంగా అందిస్తారని పేర్కొన్నారు. దిబ్బపాలెం సచివాలయంలో నిర్వహించే ఈ శిబిరంలో సచివాలయ పరిధి ప్రజలు హాజరై అవసరమైన వైద్య సేవల్ని పొందవచ్చని సూచించారు.

చెర్లోపాలెంలో...

మునగపాక : మండలంలోని చెర్లోపాలెంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో ఎం.మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మన్మథరావు కోరుతున్నారు.

ఎస్.రాయవరం: వాకపాడు సచివాలయం పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామచంద్రమూర్తి ఆదివారం తెలిపారు. సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు శిక్షణ



శిబిరంలో మాట్లాడుతున్న స్పందించే హృదయం ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు

కొంకోట: కొంకోటలో స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరయ్యే 8వ తరగతి విద్యార్థులకు ఆదివారం ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభమైంది. స్థానిక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో జరిగిన శిబిరంలో సంస్థ ఉపాధ్యక్షుడు అచంట నాగేశ్వరరావు మాట్లాడుతూ దసరా సెలవుల్లో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు అవసరమైన శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం, మనో సామర్థ్యం పెంపుదలపై శిక్షణ ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆడారి సంజీవరావు మాట్లాడుతూ మనో సామర్థ్యంపై ఇచ్చే శిక్షణ విద్యార్థులకు విద్యా సంబంధిత అంశాల్లో కూడా దోహదపడుతుందన్నారు. సంస్థ ప్రతినిధులు డి.నూకేష్, ఎస్.రమేష్‌పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



నక్కపల్లిలో సమావేశమైన 2002-03 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

నక్కపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం జరిగింది. రెండు దశాబ్దాల తర్వాత కలిసిన వీరంతా ఒకరినొకరు గుర్తుచేసుకుంటూ ఆత్మీయంగా పలకరించుకున్నారు.

చదువు పూర్తయి వివిధ ప్రాంతాల్లో పలు రంగాల్లో స్థిరపడినవారంతా ఒకచోట చేరి యోగక్షేమాలు తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించుకున్నారు. చదువుకునే సమయంలో అల్లరి చేష్టలను గుర్తుకు తెచ్చుకున్నారు. పాతజ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. 50 మందికిపైగా పూర్వ విద్యార్థులు సమావేశమై, విందు భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, నక్కపల్లి, తుని, హైదరాబాద్, విజయవాడ, యలమంచిలి, నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వీరంతా సాయంత్రం ఆనందంగా తిరుగుముఖంపట్టారు.

